


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 28-03-2023 సంపుటి : 04 సంచిక : 183 పేజీలు : 4 వెల : రూ 3-00


## కొనటం, అమ్మడమే చంద్రబాబు విజయ రహస్యం: పేర్ని నాని



తాడేపల్లి: చంద్రబాబు నంగనాచి కబుర్లు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. కొనటం, అమ్మడమే చంద్రబాబు విజయ రహస్యమని ధ్వజమెత్తారు. 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు అంటేనే నయవంచన, నమ్మకద్రోహం, వెన్నుపోటు అని దుయ్యబట్టారు. చంద్రబాబు చరిత్ర అంతా కొనుగోలు రాజకీయమేనని పేర్ని నాని మండిపడ్డారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచింది చంద్రబాబేనని గుర్తు చేశారు. ఓటుకు కోట్లు కేసులో దొరికిన చరిత్ర చంద్రబాబుది కాదా? హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చింది చంద్రబాబు కాదా? అని నిప్పులు చెరిగారు'ఉండవల్లి శ్రీదేవి స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. అవమానించారంటూ అసత్యాలు మాట్లాడుతున్నారు. ఆమెకు నియోజకవర్గంలో ఆదరణ తగ్గింది. ఆ విషయాన్ని శ్రీదేవికి పార్టీ అధ్యక్షుడు నేరుగానే చెప్పారు. టికెట్ దక్కదని ఆ ఎమ్మెల్యే పార్టీకి నమ్మకద్రోహం చేశారు' అని విమర్శించారు.

## ఒంటిమిట్ట శ్రీరామనవమి ఉత్సవాలు.. సీఎం జగన్‌కు టీటీడీ ఆహ్వానం

తాడేపల్లి :ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తన నివాసంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలు కలిశాశ్రీకోదండరామస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికను సీఎం జగన్‌కు టీటీడీ చైర్మన్, ఈవోలు అందజేశారు. ఓప్రిల్ 5వ తేదీన రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకూ శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం జరగనుంది. అదే సమయంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 09 తేదీ వరకూ ఒంటిమిట్టలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా సీఎం జగన్‌ను టీటీడీ చైర్మన్, ఈవోలు కలిసి ఆహ్వాన శుభ పత్రికను అందజేశారు.



# రాహుల్ 'అనర్హత'పై దద్దరిల్లిన పార్లమెంట్..

## నిమిషానికే ఉభయసభలు వాయిదా




ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుకు నిరసనగా పార్లమెంట్ లో ప్రతిపక్షాలు సోమవారం ఆందోళనలకు దిగాయి. రాహుల్‌పై అనర్హత వేటు , అదానీ వ్యవహారంపై విపక్ష సభ్యులు గట్టిగట్టిగా నినాదాలు చేశాయి. ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో ప్రారంభమైన కేవలం నిమిషానికే ఉభయ సభలు వాయిదా పడ్డాయి. రాజ్యసభ ను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖఢ్ మధ్యాహ్నం 2 గంటల వరకు, లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. రాహుల్ గాంధీ పై అనర్హత వేటుకు నిరసనగా కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలంతా నేడు నల్లదుస్తుల్లో పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు. అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో విపక్ష ఎంపీలు భేటీ అయి.. రాహుల్ 'అనర్హత'పై ప్రతిపక్షాల ఉమ్మడి వ్యూహం గురించి చర్చించారు. ఖర్గే కార్యాలయంలో సమావేశానికి డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, జేడీయూ, ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) తదితర పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈ భేటీలో తృణమూల్ కాంగ్రెస్, భారాస కూడా పాల్గొనడం గమనార్హం. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమికి గత కొంతకాలంగా టీఎంసీ దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. అటు తెలంగాణలో భారాస, కాంగ్రెస్ ప్రత్యర్థులుగా ఉన్నాయి. అయినప్పటికీ ఈ రెండు పార్టీలు కలిసి నేడు సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## తుది నివేదికకు 3 నెలల సమయం కావాలి: పోలవరం ముంపుపై సుప్రీంకు కేంద్రం లేఖ

ఢిల్లీ: పోలవరం ముంపుపై దాఖలైన పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం కోరింది. మూడు నెలల పాటు విచారణను వాయిదా వేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించింది. పోలవరం ప్రాజెక్టు వల్ల వరద ముంపు తలెత్తుతున్నందున దానికి పరిష్కార మార్గాలు చూపాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం మరోసారి విచారణకురానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టుకు కేంద్రం లేఖ రాసింది. గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. కసరత్తు జరుగుతోందని, తుది నివేదిక అందించడానికి మరికొంత సమయం అవసరమని పేర్కొంది. ముఖ్యమంత్రులు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సంయుక్త సమావేశం ఇంకా సంప్రదింపుల స్థాయిలోనే ఉందని సుప్రీంకోర్టుకు తెలిపింది. పొరుగు రాష్ట్రాల్లో ముంపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలని, భాగస్వాములతో సమావేశం నిర్వహించాలని, అవసరమైతే ప్రభావిత రాష్ట్రాల సీఎంలు కూర్చొని మిగిలిపోయిన సమస్యలు పరిష్కరించుకోవాలని గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తుది నివేదిక అందించడానికి మూడు నెలల సమయం కావాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానానికి కేంద్రం లేఖ సమర్పించింది.



# వైఎస్సార్ ఏపీ 1 పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి అమర్నాథ్

విశాఖపట్నం: విశాఖపట్నంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2023-27 వైఎస్ఆర్ ఏపీ 1 పోర్టల్‌ను మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, డైరెక్టర్ సృజన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నూతన ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో పారిశ్రామిక వేత్తల ఆలోచనల్ని పరిగణలోకి తీసుకుంటున్నామని అన్నారు. ఎకనామికల్ గ్రోత్ అనేది ప్రధాన అంశంగా తీసుకున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్ ఏపీ పోర్టల్ ద్వారా 21



రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతి ఇవ్వడంతో పాటు మూడు వారాల్లోనే పరిశ్రమలకు భూమి కేటాయింపు ఉంటుందన్నారు. దేశంలో 3 కారిడార్లు ఉన్న రాష్ట్రం ఏపీ.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగుదామన్నారు. విశాఖ వేదికగా జీ20 సదస్సుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సదస్సు రేపట్నుంచి 30 వరకు జరగనుంది. ఇందుకు 40 దేశాల నుంచి 200 మంది దేశ, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇప్పటికే విశాఖలో జీఐఎస్ విజయవంతం కాగా జీ20 సదస్సును కూడా అదే రీతిలో నిర్వహించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖను అత్యంత సుందరంగా జీవీఎంసీ అధికారుల తీర్చిదిద్దారు.

## వివేకా హత్య కేసు విచారణపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 27, (న్యూస్ పల్స్)వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు విషయంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ అధికారిని మార్చాలని ధర్మాసనం ఆదేశించింది. స్టేటస్ రిపోర్టులో ఎలాంటి పురోగతి లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తించింది. కేసును ఇంకా ఎంత కాలం విచారణ చేస్తారని, హత్యకు గల ప్రధాన కారణాలు, ఉద్దేశాలు బయటపెట్టాలని ధర్మాసనం ఆదేశించింది. 'విచారణ చేసే అధికారిని మార్చండి లేదా ఇంకో అధికారిని నియమించండి' అని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సీబీఐ దాఖలు చేసిన సీల్డ్ కవర్ రిపోర్టు మొత్తం చదివామని ధర్మాసనం చెప్పింది. కేసు అంతా రాజకీయ దురుద్దేశంతో కూడినదే అని రిపోర్ట్‌లో రాశారని న్యాయమూర్తి చెప్పారు. మెరిట్స్ మీద ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. సీబీఐ డైరెక్టర్ నుంచి తగిన ఆదేశాలు తీసుకోవాలని సూచించింది. ఆ కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ హత్య



కేసులో ఏ - 5 నిందితుడిగా ఉన్న శివశంకర్ రెడ్డి భార్య తులసమ్మ పిటిషన్ వేశారు. దర్యాప్తు వేగంగా జరగడం లేదని, దర్యాప్తు అధికారిని మార్చాలని కోరుతూ తులసమ్మ పిటిషన్‌లో కోరారు. గత సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేయగా, దర్యాప్తు పురోగతిపై సీల్డ్ కవర్‌లో నివేదిక అందించాలని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది. దీంతో దర్యాప్తు పురోగతి, పూర్వాపరాల విషయాలపై నివేదిక దాఖలు చేసినట్లు సమాచారం. దర్యాప్తు అధికారి సక్రమంగానే విచారణ చేస్తున్నారని గత వారం సుప్రీంకోర్టుకు సీబీఐ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ తెలిపారు. గత సోమవారం వాదనల సందర్భంగా వివేకా హత్య కేసు దర్యాప్తు ఎందుకు పూర్తి చేయడం లేదని కోర్టు సీబీఐని ప్రశ్నించింది. దర్యాప్తు అధికారి విచారణను ఎందుకు జాప్యం చేస్తున్నారని అడిగింది. విచారణ త్వరగా ముగించలేకపోతే మరో దర్యాప్తు అధికారిని ఎందుకు నియమించకూడదని అడిగింది. తాజాగా ఈ ఆదేశాలు ఇచ్చింది.

# ఏపీలో మళ్లీ ఉపఎన్నికలు...?

విజయవాడ, మార్చి 27, శాసన సభ్యుల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల అంశం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపలనకు కారణం అయ్యింది..అందులో భాగంగానే 24గంటల్లోనే సస్పెండ్ చేశారు. ఆ తరువాత కూడ ఆ నలుగురి పై కఠిన చర్యలుతీసుకునే విధంగా, అనర్హత వేటు వేసేందుకు అవసరం అయిన అంశాలను పరిశీలిస్తున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారం పై ఇంతటితో ఆగిపోకూడదనే ఉద్దేశంలో జగన్ ఉన్నారని ప్రచారం జరుగుతుంది. అధికార పార్టీలో ఉంటూ, ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థికి ఓటు వేయటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇంకా కఠినంగా వ్యవహరించటం ద్వారా భవిష్యత్ లో ఇలాంటి పరిస్థితుల వైపు శాసన సభ్యులు వెళ్లాలన్నా కూడ భయపడే విధంగా చర్యలు ఉండాలని భావిస్తున్నారు. ఆ నలుగురు శాసన సభ్యుల పై అనర్హత వేటు వేసే అంశం పై కూడ పరిశీలన చేస్తున్నారని వైఎస్ఆర్ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరు గా సాగుతోంది. అసెంబ్లి సాక్షిగా జరిగిన ఎమ్మెల్సీ కోటా ఎన్నికల్లో అదికార పార్టీకి చెందిన శాసన సభ్యులు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారు. అయితే ఇదే అంశానికి సంబందించిన ఆదారాలు ఇప్పుడు కీలకంగా మారాయి. క్రాస్ ఓటింగ్ కు పాల్పడిన శాసన సభ్యులు పై అనర్హత వేటు వేయాలంటే, అందుకు సంబందించిన ఆధారాలు కూడా పకడ్బందీగా ఉండాలి. కేవలం మెక్కుబడిగా ఈ వ్యవహారాన్ని సాగదీయకుండా, అన్ని వైపుల నుండి అనర్హతకు అవసరం అయిన ఆధారాలను సేకరించటం ద్వారా ,భవిష్యత్ లో పోటీ చేయకుండా చర్యలు తీసుకునే విధంగా చర్యలు ఉండాలని భావిస్తున్నారని పార్టి వర్గాల్లో చర్చ జరుగుతుంది. క్రాస్ ఓటింగ్ కు సంబంధించిన ఆధారలు పూర్తిగా బయటకు తీసుకురాలేని పక్షంలో అందుకు ప్రత్యామ్నాయంగా అవసరం అయిన ఇతర అంశాల పై కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు ఆరా తీస్తున్నారని అంటున్నారు. వాస్తవానికి అనర్హత అంశం...పై పార్టీ నాయకత్వం అంతగా శ్రద్ద చూపించలేదు. పార్టీ నుండి సస్పెండ్ చేయటం వరకే పరిమితం కాకుండా,ఇంకా ఎదైనా చర్య ఉండాలని భావించారు. అయితే అదే సమయంలో బీజేపి ప్రభుత్వం రాహుల్ గాందీ పై వేటు వేసి అంశం తెర మీదకు రావటంతో,అదే అంశాన్ని పార్టీ నేతలు ఆ నలుగురు శాసన సభ్యులు పై కూడ ప్రయోగించాలనే ఆలోచనకు వచ్చినట్లుగా చెబుతున్నారు. పార్టీ నుండి సస్పెండ్ కు గురయిన ఆ నలుగురు శాసన సభ్యులు మరింత దూకుడుగా కామెంట్స్ చేస్తున్నారు. ఎమ్మెల్యేలకు జగన్ సరైన గుర్తింపు ఇవ్వడం లేదని, సీనియర్లను కనీసం గౌరవించే సంస్కృతి లేదని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నమస్కారానికి ప్రతి నమస్కారం కూడా చేయరని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి వద్ద ఉండే గౌరవ మర్యాదలు జగన్ వద్ద లేవన్నారు. నాకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనని, ఎమ్మెల్సీ ఇస్తామన్నారని, ఎమ్మెల్సీ అవకాశం తనకు వద్దని జగన్‌కు చెప్పానన్నారు. ఎవరో సలహాదారుల్ని ఎమ్మెల్యేలపై పెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. సలహాదారులు జగన్‌కు ఇచ్చే సలహాలు ఏంటని ఆయన అన్నారు. వైసీపీలో నుంచి 50 మంది ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. వైనాట్ 175 అనడానికి జగన్‌కు ఉన్న ధైర్యం ఏంటని నిలదీశారు. ఏదో బటన్లు నొక్కి అంతా బాగుందని అనుకుంటున్నారని,ఉద్యోగులకు జీతాలివ్వకపోవడం చాలా ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

# రావాల్సిన డబ్బులే అడుగుతుంటే.. కాకిలెక్కలు చెబుతున్నారు: బొప్పరాజు

అమరావతి: ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ఏపీ అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. వచ్చే నెల 5న అన్ని ఉద్యోగ సంఘాలతో విజయవాడలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి చట్టపరంగా రావాల్సిన డబ్బులనే తాము అడుగుతున్నామన్న ఆయన.. బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం కాకిలెక్కలు చెబుతోందని మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "మేం దాచుకున్న డబ్బులే కాకుండా మాకు చట్టపరంగా రావాల్సిన డబ్బుల్ని సైతం చెల్లించకుండా.. రిటైర్ అయినవాళ్లకు గానీ, మరణించిన వారికి గానీ బెనిఫిట్స్ ఇవ్వలేనటువంటి పరిస్థితుల్లో మేం ఉద్యమం మొదలు పెట్టాం. మొన్న జరిగిన చర్చల్లో ఇప్పటికే రూ.3వేల కోట్లకు పైగా చెల్లింపులు చేశామని ప్రభుత్వం చెబుతోంది. మాటలు కాదు.. రాతపూర్వకంగా ఇవ్వండి. ఇంకా ఎంత పెండింగ్‌లో ఉంది? ఎంత చెల్లించారు? ఇంకా ఎంత ఇవ్వాలనేది రాతపూర్వకంగా ఇవ్వండని మేం ప్రభుత్వాన్ని అడిగాం. పీఆర్సీ ఎరియర్స్‌ను రిటైర్మెంట్ తర్వాత ఇస్తామని చెబుతూ ప్రభుత్వం ఇచ్చిన మెమోను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పాం. 11వ పీఆర్సీలో పే స్కేల్ ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టే పరిస్థితుల్లో ఉద్యమం కొనసాగించాలని మేం నిర్ణయించాం. ఏప్రిల్ 5న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల



నాయకత్వంతో, పలు శాఖలకు సంబంధించిన సంఘాల నేతలతో సమావేశాలు నిర్వహించుకొని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తాం"అని బొప్పరాజు వెంకటేశ్వర్లు వివరించారు

# వైఎస్సార్ వ్యూ పాయింట్ నామకరణం

విశాఖపట్నం విశాఖ సీతకొండ వద్ద ఉన్న వ్యూ పాయింట్కి వైయస్సార్ వ్యూ పాయింట్గా నామకరణం చేశారు. 2.39 కోట్లతో జి20 నేపథ్యంలో అభివృద్ధి.. చేసిన వ్యూ పాయింట్ను మంత్రులు గుడివాడ అమర్నాథ్, ఆదిమూలపు సురేష్, విడుదల రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడారు. ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేయడం చంద్రబాబుకు కొత్త కాదని, ఆయనలో ఎలాంటి మార్పు లేదన్నా రు. చంద్రబాబు వాపుని చూసి బలుపు అనుకుంటున్నాడని విమర్శించారు. లేని ప్రజాదరణ, ఉన్నట్లు భావిస్తున్నా రని చెప్పారు. చంద్రబాబు తల కిందకు పెట్టి కాళ్ళు పైకి పెట్టి తపస్సు చేసిన. 2024లో మళ్లీ వైసీపీ గెలుస్తుందన్నా రు. చంద్రబాబు కుట్ర స్వతంత్రాలకు పరాకాష్టన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన వ్యక్తులు గురించి మాట్లాడడం అనవసరమన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన వైసీపీ యువ నాయకుడుదేవ సాని ఆదిత్య రెడ్డి

బద్వేలు బద్వేల్ పట్టణం సిద్ధవటం రోడ్డు ఎస్సీ హాస్టల్ వద్ద వైయస్సార్సీపి యువ నాయకులు దేవసాని ఆదిత్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, కన్వీనర్ ఈగ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి, అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు, తోపాటు పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు అధికారుల చేతల మీదుగా మంచినీటి ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు అనంతరం ప్రజలకు ఉచిత మజ్జిగ ను దేవసాని ఆదిత్య రెడ్డి చేతుల మీదుగా వితరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పి,వి,ఎన్ ప్రసాద్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే,వీ సుబ్బారావు, ఏపీ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రంపాటి సుందర రామ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ చాపాటి సాయి, కౌన్సిలర్లు దుద్దుకూరు సత్యనారాయణ, భూమిరెడ్డి ఓబుల్ రెడ్డి, సీనియర్ నాయకులు, సింగ సాని శివయ్య. ప్రతాప్ కుమార్, నిమ్మకాయల గురివిరెడ్డి, రమేష్ బాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, సరిటాల మౌలాలి, కొలిశెట్టి కొలిశెట్టి సత్యనారాయణ, పలువురు నాయకులు వార్డు ప్రజలు పాల్గొన్నారు

# వైయస్సార్ ఆసరా సంబరాలు

బద్వేలు వైయస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు భాగంగా సోమవారం బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండలంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా మండల ఇన్చార్జులు, మండల కన్వీనర్లు,మండల నాయకులు, గృహ సారధులు,వాలంటీర్లు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా

## "రైతులుమరియు ప్రజా ప్రజా నిధులు ఆర్డీవో కు వినతి పత్రం

పత్తికొండ పత్తికొండ చెరువు ను వైసీపీ నాయకుడు కబ్జా చేసిన ఘటనపై స్థానిక ఆయకట్టు రైతులు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కబ్జా చేసినటువంటి వైసీపీ నాయకుడు సాబ్దిన్ నూర్భాషపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన పత్తికొండ చెరువు చాలా పురాతనమైన చెరువు అని చాలా గ్రామాలకు త్రాగు, సాగునీరుకు భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడే చెరువు అన్నారు. వైసిపి పార్టీకి చెందిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గత నాలుగు సంవత్సరాలుగా చెరువులు నింపుతామని చెబుతున్నారు కానీ నింపిందే లేదు కానీ వైసీపీ వాళ్ళ పార్టీ నాయకులు చెరువును కబ్జా చేసేందుకు మొదలుపెట్టారు. అధికార పార్టీకి చెందిన సాబ్దిన్ నూర్ భాషా గద్దలు వాలినట్టు వాలి చెరువులు కుంటలు కబ్జాలు చేస్తున్నారని అన్నారు అధికారులు వైసిపి వాళ్ళు ఏమి చెప్తే అది చేస్తూ కబ్జాకు సహకరిస్తున్నారు చెరువుకు సంబంధించి సాబ్దిన్ నూర్ భాషా చెరువు తూములను, కడుగొమ్ములను కబ్జా చేసి ఆరు అడుగుల మేర మట్టి వేసి పూడ్చి వేశాడు. ఇతడు ఆక్రమణలు చేసి కబ్జా చేస్తూ అధికారుల ద్వారా పట్టాలు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనిపై చర్యలు తీసుకోకపోతే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజలు రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అధికారులను హెచ్చరించారు ఇప్పటికైనా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించి చెరువును కబ్జా చేసిన సాబ్దిన్ నూర్ భాషా పై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారుల సహాయంతో చెరువును కబ్జా చేసి రాత్రికి రాత్రి తుములను కడుగోమ్మలను పూడ్చి వేస్తుంటే అధికారులు కళ్ళు మూసుకుని నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. అనంతరం ఆర్డిఓ మోహన్ దాస్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

# ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిసిన తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి

తుగ్గలి మండల కేంద్రమైన తుగ్గలికి చెందిన మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం రాజకీయాలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చర్చించినట్లు తెలియజేశారు.అలాగే నియోజవర్గంలోనే వైయస్సార్సీపి పార్టీ నాయకులు,కార్యకర్తలు యోగక్షేమాల పై కూడా చర్చించినట్లు తెలియజేశారు.అంతేకాక పార్టీ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన వాటిపై కూడా చర్చించినట్లు తెలుస్తుంది.2024లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే పని చేస్తామని ఆయన తెలిపారు.అలాగే నాయకులు,కార్యకర్తల సమస్యలను కూడా ముఖ్యమంత్రి కి వివరించినట్లు తెలిపారు.నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కోరినట్లు ఆయన తెలిపారు.త్వరలో పార్టీ నాయకులకు,కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తమకు హామీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చినట్లు తెలిపారు.అలాగే తుగ్గలి మోహన్ రెడ్డి ,తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి లు కూడా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలతో విడుదల రజనీ

గుంటూరు, మార్చి 27, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్ల పాటు ఒకే ఒక నేతను పక్కనపెట్టారన్న కామెంట్స్ నిన్నటి వరకూ వినిపించాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ పూర్తయి మర్రి రాజశేఖర్ గెలవడంతో ఆయనకు పార్టీ ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పుడు ఎన్నికైన ఎమ్మెల్సీలందరూ 2029 వరకూ పదవిలో ఉంటారు. అంటే 2024 ఎన్నికలే కాదు, 2029 ఎన్నికల చివరి వరకూ వీరి పదవీ కాలం ఉండనుంది. కౌన్సిల్ వీళ్లంతా కీలకంగా మారనున్నారు. అందుకే జగన్ చివరిగా తమకు నమ్మకమైన వారికే ఎమ్మెల్సీ పదవులు జగన్ ఇచ్చారన్న వాదన పార్టీ నుంచి వినిపించింది. వైసీపీ నుంచి ఏడుగురు పోటీ చేసినా ఆరుగురే గెలిచారు. అందులో మర్రి రాజశేఖర్ ఉండటం మంత్రి విడుదల రజనీకి ఉపశమనం అనే చెప్పాలి. ఇందులో చిలకలూరిపేటకు చెందిన మర్రి రాజశేఖర్ కు ఎమ్మెల్సీ పదవి లభించడంతో మంత్రి విడదల రజనీ వర్గీయులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఫలితాలు రావడం, రాజశేఖర్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఇక ఆమెకు వచ్చే ఎన్నికల్లోనూ చిలకలూరిపేట టిక్కెట్ ఖాయమని చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకూ విడుదల రజనీకి టిక్కెట్ వస్తుందా? లేదా? అన్న అనుమానానికి తెరపడింది. మర్రి రాజశేఖర్ ఎమ్మెల్సీ కావడంతో ఇక తమ నేత విడదల రజనీకి తిరుగుండదని ఆమె వర్గీయులు భావిస్తున్నారు.విడదల రజనీ తొలి నుంచి లక్కీ పర్సన్ అనే చెప్పుకోవాలి. ఎన్ఆర్ఐగా ఉంటున్న విడదల రజనీ తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. టీడీపీలో ఉంటే తనకు చిలకలూరిపేట టిక్కెట్ ఎప్పుడూ దక్కదని భావించిన విడదల రజనీ 2019 ఎన్నికలకు ముందు పార్టీ మారారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అక్కడ ఉన్నంత వరకూ తాను టీడీపీలో ఎదిగేది ఉండదని, బీసీ నేతగా గుర్తింపు కూడా ఉండదని భావించిన విడదల రజనీ వైసీపీలోకి వెళ్లారు. వెళ్లడమే తరువాయి చిలకలూరిపేట టిక్కెట్ ను చేజిక్కించుకున్నారు. బలమైన కమ్మ సామాజికవర్గానికి చెందిన మర్రి రాజశేఖర్ను కాదని జగన్ సామాజికవర్గ సమీకరణాల్లో భాగంగా ఆమెకు టిక్కెట్ దక్కింది,ఇక మంత్రి పదవి కూడా తొలిసారి గెలిచినా అదే ఫార్ములాలో ఆమెకు దక్కింది. తొలి సారి గెలిచారన్నది లేకుండా జగన్ కీలకమైన వైద్య ఆరోగ్యశాఖను ఆమెకు అప్పగించారు. అయితే మర్రి రాజశేఖర్ కు మొన్నటి వరకూ ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవి ఏదీ రాకపోవడంతో వచ్చే ఎన్నికల్లో విడదల రజనీకి టిక్కెట్ రాదన్న అంచనాలు వినిపించాయి. అయితే ఎమ్మెల్యే కోటా కింద మర్రి రాజశేఖర్ కు ఎమ్మెల్సీ టిక్కెట్ ఇవ్వడం, ఆయన గెలుపొందడంతో ఇక విడదల రజనీ డేంజర్ జోన్ లో లేనట్లేనని చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో కమ్మ సామాజికవర్గంతో పాటు బీసీలు కూడా ఎక్కువగా ఉండటంతో ఈసారి కూడా టిక్కెట్ తమనేతకేనన్న ధీమా మంత్రి విడదల రజనీ అనుచరులున్నారు. మరి చివరకు రజనీకి టిక్కెట్ వస్తుందా? లేదా? అన్నది వచ్చే ఎన్నికల సమయానికి తెలిసినా..ప్రస్తుతానికి మాత్రం ఆమె వర్గీయులు రిలీఫ్ ఫీలవుతున్నారు.

# పాపం..శ్రీదేవి.

గుంటూరు, మార్చి 27, కొంత మంది అంతే.. అలా వచ్చి అలా వెళ్లిపోతారు. అదృష్టం తలుపుతట్టినా ఆలస్యంగా తెరిచే దురదృష్టవంతులు కొందరుంటారు. రాజకీయాల్లోనూ అంతే. చదువు, సామర్థ్యం, సామాజికవర్గం అన్నీ ఉండి అవకాశాలు రాని వారు అనేక మంది ఉంటారు. కోటిలో ఏ ఒక్కరికో పాలిటిక్స్ లో అవకాశం దొరుకుతుంది. దానిని సద్వినియోగం చేసుకోలేకపోతే ఇక అంతే. తొలి విడతతోనే తెరమరుగవుతుంటారు. తాత్కాలిక ప్రలోభాలకు ఆశపడితే శాశ్వతంగా దూరమయిన వాళ్లను రాజకీయాల్లో అనేకమందిని చూశాం. అందులో లక్ కొద్దీ తొలిసారి ఎమ్మెల్యే అయి తర్వాత స్వయంకృతాపరాధంతో రాజకీయ జీవితానికే ఫుల్ స్టాప్ పెట్టుకున్న వాళ్లను చాలా మందిని చూశాం. అందులో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఒకరు. డాక్టర్ గా యమ బిజీగా ఉండే శ్రీదేవి తాను రాజకీయాల్లోకి వస్తానని ఊహించలేదు. వైఎస్ భారతితో పరిచయం ఆమె జీవితాన్ని మార్చింది. భారతి సిఫార్సుతో ఆమెకు తాడేపల్లి టిక్కెట్ జగన్ ఇచ్చారంటారు. డాక్టర్ గా సక్సెస్ అయిన ఉండవల్లి శ్రీదేవి పొలిటికల్ కూడా తొలి అడుగులోనే విజయం సాధించగలిగారు. అదీ జగన్ చరిష్మాతో అని వేరే చెప్పాల్సిన పనిలేదు. కానీ చక్కగా పనిచేసుకోవాల్సిన శ్రీదేవి గ్రూపులకు తెరదీశారు. తాడికొండలో తనకు తలనొప్పి తానంతటే తెచ్చుకున్నారు. తాడేపల్లి వైసీపీ రెండు వర్గాలుగా విడిపోవడానికి ఆమె కారణమయ్యారు. జగన్ ఫ్యామిలీతో ఉన్న సంబంధాలను కూడా ఆమె వినియోగించుకోలేకపోయారు. తద్వారా గెలిచిన తర్వాత కొద్ది రోజులకే తాడికొండ నియోజకవర్గంలో అసంతృప్తి బయలుదేరినా పార్టీ పెద్దలకు చెప్పి సరి చేసుకోక పోగా కోతిపుండు బ్రహ్మరాక్షసిగా చేసుకున్నట్లు ఆమె మరింత సమస్యను పెద్దదిగానూ, జటిలంగానూ చేసుకున్నారు. దీంతో పార్టీ అధినాయకత్వం అక్కడ మరొకరిని సమన్వయ కర్తగా నియమించే పరిస్థి?తిని తనంతట తానే తెచ్చుకున్నారు. కేవలం ఒక వర్గాన్ని వెనకేసుకు రావడం, అక్కడి ఆధిపత్యం ఉన్న సామాజికవర్గంతో తలపడటం ఉండవల్లి శ్రీదేవికి తలనొప్పి తెచ్చిందని చెప్పాలి. అంతటితో ఆగినా సరిపోయేది. కానీ ఆమె ఊరుకోలేదు. మరింత కాలుదువ్వారు. దీంతో ఆమెపై ఉన్న వ్యతిరేకతను గమనించి అధిష్టానం ఎమ్మెల్సీ ఎన్నికలలో డొక్కా మాణిక్యవరప్రసాద్ ను ఎంపిక చేయకుండా క్లారిటీ ఇచ్చింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ లేదని నేరుగానే చెప్పింది. దీంతో ఉండవల్లి శ్రీదేవి తనకు టిక్కెట్ రాదని డిసైడ్ అయిపోయారు.. పోనీ వేరే పార్టీలోకి వెళితే ఎలాంటి పదవులు దక్కవు. వారు ఇచ్చిన హామీలు కూడా అమలు కావని ఆమెకు తెలియంది కాదు. తమ ప్రయోజనం నెరవేరిన తర్వాత అసలు మొఖం కూడా చూడని వైపు ఆమె టర్న్ అయ్యారు. పోనీ జగన్ ను కలసినప్పుడు ఆమెకు అక్కడి నుంచి మార్చి వేరే చోట టిక్కెట్ ఇస్తామని చెప్పినా ఆమె విని ఉంటే బాగుండేది. మరోచోట టిక్కెట్ లేదో మరోసారి ఎమ్మెల్సీ పదవి అయినా దక్కేది. అలా కాకుండా క్రాస్ ఓటింగ్ కు పాల్పడి ఇప్పుడు రెంటికీ చెడ్డ రేవడిగా మారిపోయారు. ఇప్పుడు ఆమెకు వేరే దారి లేదు. రాజకీయంగా ప్రభావం చూపగలిగిన నేత అయినా ఏదో ఒక పార్టీ దరిచేర్చుకునేది. కానీ డాక్టర్ కు ఆ క్వాలిఫికేషన్ కూడా లేదు. ఈ ఏడాది కాలంలో ఆమె నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే అక్కడ కాలు మోపితే వైసీపీ నేతల నుంచి తీవ్ర వ్యతిరేకమవుతుంది. ఇలా తొలిసారి ఎమ్మెల్యే అయి సింగిల్ టైం శాసనసభ్యురాలిగా మిగిలిపోయిన ఉండవల్లి శ్రీదేవి తనంతట తానే రాజకీయంగా జీవితాన్ని సమాధి చేసుకున్నారు.

పార్టీపై హాట్ కామెంట్స్

వైసీపీ నుంచి బహిష్కరణకు గురైన తాటికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఆదివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. తాడికొండలోని పార్టీ ఆఫీస్ పై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. అసలు తాను చేసిన తప్పు ఏంటని ప్రశ్నించారు. రాజధాని ఏరియాలో తనను అడ్డంపెట్టుకొని కొందరు వైసీపీ నేతలు అక్రమంగా ఇసుక దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వాటికి తాను అడ్డంకిగా మారినందుకే తప్పించారని కామెంట్స్ చేశారు."నేను ఓటేసిన టేబుల్ కింద ఎవరైనా కూర్చున్నారా..? నేను మాత్రమే క్రాస్ ఓటింగ్ చేశానని తేల్చారు.జనసేనతో పాటు టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చిన ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. రాజధాని పరిధిలో ఎమ్మెల్యేగా ఉన్న నన్ను తప్పించాలని కుట్ర చేశారు. అందరిచేత తిట్టించేలా ప్లాన్ చేశారు. దొంగ అనేలా నాపై ముద్ర వేశారు. నన్ను పిలిచి మాట్లాడితే పక్కకు జరిగేదాన్ని కాదా...? ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉందా లేదా అనేది అర్థం కావటంలేదు. అమరావతి ఇక్కడే ఉంటుందంటూ ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్కరికి చెప్పాను. ఈ విషయంలో నేను మాట ఇచ్చాను. అందరు నమ్మి నాకు ఓటేశారు. ఇవాళ ఆ దారి నుంచి వెళ్తుంటే... అమరావతి రైతులు, మహిళలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వారిని చూసి ప్రతిరోజు బాధపడేదాన్ని. అమరావతిలో వైసీపీ ప్రభుత్వం ఏం చేసింది. ఎస్సీలపై తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్నారు. ఇవాళ ఓ ఎమ్మెల్యేగా నేనే భయపడుతున్నాను. సామాన్యులు అసలు ఆంధ్రప్రదేశ్ లో తిరిగే పరిస్థితి లేదు" అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు శ్రీదేవి.ఇక నుంచి అమరావతి రైతులతోనే ఉంటానని ఎమ్మెల్యే శ్రీదేవి స్పష్టం చేశారు. ప్రాణం పోయినా సరే అమరావతి రైతులకు మద్దతు ఉంటుందన్నారు. అమరావతి రాజధాని ఉద్దండయ్యపాలెంలో ఇసుక మాఫియా ఎవరిది. దానికి నేను అడ్డం వస్తున్నాను అని ఈ విధంగా నన్ను పార్టీ నుంచి తప్పించారు. రాజధానిగా అమరావతే ముద్దు అని చెప్పారు. క్రాస్ ఓటింగ్ చేసి డబ్బులు తీసుకుంటున్న వారికి శ్రీదేవి సవాల్ విసిరారు. ఏ దేవుడి వద్ద అయినా? ప్రమాణం చేయటానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. తనకు ఏదైనా జరిగితే ప్రభుత్వ సలహాదారు సజ్జలదే బాధ్యత అని తేల్చి చెప్పారు. తన భద్రతపై పూర్తి నమ్మకం కలిగితేనే ఆంధ్రప్రదేశ్ కు వస్తానని చెప్పుకొచ్చారు.

"నా కళ్లు తెరిపించిన అమరావతి రైతులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఎమ్మెల్యేగా నేను అండగా ఉంటాను. మీ పక్కనే కూర్చుంటాను. ఉద్యమం చేస్తున్న ప్రతి ఒక్కరికి మద్దతుగా ఉంటాను. అమరావతిని సాధించుకోవాల్సిన అవసరం ఉంది. ఎమ్మెల్యేకు రక్షణకు లేని పరిస్థితి ఏపీలో ఉంది. దిశా యాప్స్ ఎక్కడ పోయాయ్...? వైసీపీ గుండాలతో పచ్చి బూతులు తిట్టిస్తున్నారు. త్వరలోనే మంచి రిటర్న్ గిఫ్ట్ కూడా ఇస్తాను. జగన్ గారు కొట్టిన దెబ్బకు మైండ్ బ్లాక్ అయింది. పార్టీ కోసం ఎంతో పని చేశాను. ప్రస్తుతం ఏ పార్టీలోకి వెళ్లే ఆలోచన లేదు. ప్రస్తుతం స్వతంత్ర ఎమ్మెల్యేగా ఉన్నా. మరోసారి మీడియా ముందుకు వస్తాను" అని శ్రీదేవి స్పష్టం చేశారు

# ఎదురు తిరుగుతున్న సస్పెన్షన్ వ్యవహారం

విజయవాడ, మార్చి 27, క్రాస్ ఓటింగ్ చేశారని నలుగురు ఎమ్మెల్యేల్ని వైఎస్ఆర్సీపీ హైకమాండ్ సస్పెండ్ చేసింది. వారిపై అనర్హతా వేటు వేస్తారన్న చర్చ కూడా ప్రారంభమయింది. అసలు అనర్హత వేటు వేయకుండా కేవలం సస్పెండ్ చేసి ప్రయోజనమేముందన్న వాదనా వినవస్తోంది. అనర్హత వేటు వేయకుండా కేవలం సస్పెండ్ చేయడం వల్ల ఎమ్మెల్యేలకు వచ్చే ఇబ్బందేమీ ఉండదన్న వాదన గట్టిగా వినిపిస్తోంది.కేవలం సస్పెన్షన్ తోనే వదిలేస్తే.. పార్టీని ధిక్కరించి సస్పెన్షన్ వేటు వేయించుకునేందుకు పెద్ద సంఖ్యలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు రెడీ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, పార్టీని ధిక్కరించడానికి ఇసుమంతైనా వెనుకాడకుండా ముందుకు వచ్చేవారి సంఖ్య పెద్దగానే ఉంటుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సస్పెండైన నలుగురిపైనా అనర్హత వేటు వేయడానికి అవసరమైన ప్రక్రియపై హై కమాండ్ దృష్టి పెట్టిందని పార్టీ శ్రేణులే అంటున్నాయి. అయితే ఇక్కడే రాజ్యాంగ నిపుణులు పార్టీ నుంచి సస్పెండ్ అయితే చేయగలరు కానీ, క్రాస్ వోటింగ్ పేరు చెప్పి వారిపై అనర్హత వేటు వేసే అవకాశాలైతే లేవని అంటు న్నారు. క్రాస్ వోటింగ్ పేరు చెప్పి పార్టీ నుంచి సస్పెండ్ చేయడం కూడా.. పార్టీలో అసంతృప్తి ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువ ఉందన్న వార్తలు వినవస్తున్న నేపథ్యంలో వారిని కట్టడి చేయడానికి మాత్రమేనని అంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో, ఆ తరువాత తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్ లో ఒకేసారి ఒకే సారి ఒకే పార్టీకి చెందిన, అందులోనూ అధికార పార్టీకి చెందిన నలుగురు శాసనసభ్యులు పార్టీ నుండి సస్పెండ్ కావడం ఇదే తొలిసారి. ఇక ఇప్పుడు వైసీపీ సస్పెండ్ చేసిన నలుగురు ఎమ్మెల్యేలలో ఇద్దరు చాలా కాలం కిందటి నుంచే పార్టీ విధానాలను బహిరంగంగా వినిపిస్తూ వస్తున్నవారే. మరో ఇద్దరిని క్రాస్ ఓటింగ్ ఆరోపణలతో సస్పెండ్ చేస్తూ గతం నుంచీ పార్టీ లైన్ కు భిన్నంగా బహిరంగంగా మాట్లాడుతున్నవారిపై కూడా వైసీపీ వేటు వేసింది. ఇక సస్పెన్షన్ తరువాత ఏమిటి? అనర్హత వేటు పడుతుందా? అంటే.. ఆ అవకాశాలు లేవనే చెబుతున్నారు రాజకీయ పరిశీలకులు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేపై కానీ ఎంపీపై కానీ అనర్హత వేటు వేయాలంటే వారు వేరే పార్టీలో చేరడమే, లేదా పార్టీ విప్ ను ధిక్కరించడమో చేయాలి. ఇక్కడ ఇప్పుడు వైసీపీ నుంచి సస్పెన్షన్ కు గురైన వారెవరూ వేరే పార్టీలో చేరలేదు.ఇక రహస్య ఓటింగ్ లో విప్ ను ధిక్కరించారని తేల్చడానికి ఆధారాలు ఉండవు. అసెంబ్లీలో, లోక్ సభలో, రాజ్యసభలో బిల్లుల పైచర్చ సందర్భంగా జరిగే బహిరంగ ఓటింగ్ సందర్భంగా విప్ ధిక్కరించిన వారిని గుర్తించి అనర్హత వేటు వేయడానికి వీలు ఉంటుంది. అందుకే ఇప్పుడు పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నలుగురూ డిస్ క్వాలిఫై అయ్యే అవకాశాలు లేవనే అంటున్నారు. సో వైసీపీ నలుగురిని సస్పెండ్ చేసి ఇంకా అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్న పలువురిని పరోక్ష హెచ్చరిక జారీ చేసిందని భావించాల్సి ఉంటుంది. పార్టీ శ్రేణుల సమాచారం మేరకు పాతిక మందికి పైగా అసంతృప్త ఎమ్మెల్యేల పేర్లతో ఐ ప్యాక్ ఒక జాబితాను జగన్ కు అందించిందని చెబుతున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో మరో అభ్యర్థిని నిలబెట్టినా గెలిచి ఉండేవారమంటూ తెలుగుదేశం పేర్కొనడానికి కారణం కూడా అదేనని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే క్రాస్ ఓటింగ్ పేర నలుగురిని సస్పెండ్ చేసిన, డిస్ క్వాలిఫై చేస్తున్నామంటూ ప్రచారం చేయడం ద్వారా అసంతృప్తులకు గట్టి హెచ్చరిక పంపామని వైసీపీ భావిస్తోందని పరిశీలకులు అంటున్నారు. ఇలాంటి అనర్హతా వేటు ప్రచారంద ద్వారా కంట్రోల్ చేయాలనుకుంటున్నారనీ, అది సాధ్యమయ్యే పని కాదనీ అంటున్నారు.

# వైజాగ్ లో మంత్రులు...

విశాఖపట్టణం, మార్చి 27, (న్యూస్ పల్స్)రాష్ట్ర మంత్రులు కొందరు వైజాగ్ లో మకాం వేశారు . ఈనెల 28, 29తేదీల్లో జరగనున్న జీ 20 సదస్సు ఏర్పాట్లను వారు సమీక్షిస్తున్నారు. దాదాపు 45 దేశాల ప్రతినిధులు హాజరుకానున్న ఈ సదస్సులో వైజాగ్ కల్చర్ ప్రతిబింబించేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు వారు చెబుతున్నారు. ఇంఛార్జ్ మంత్రి విడదల రజని, మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్ నాథ్ సహా కీలక అధికారులు అంతా వైజాగ్ లోనే ఈ సదస్సు పూర్తయ్యే వరకూ ఉండబోతున్నారు. సదస్సు నిర్వహణకు కావలసిన ఏర్పాట్లను దాదాపు పూర్తి చేసినట్లు జిల్లా ఇంఛార్జి మంత్రి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి విడదల రజని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంత్రులు, అధికారులతో సదస్సు ఏర్పాట్లపై చివరి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సుమారు 157 కోట్ల రూపాయలతో శాశ్వత ప్రాతిపదికన నగర సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన 200 మంది ప్రతినిధులు రానున్నారని, వారి కి కావలసిన రవాణా, వసతి, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సదస్సు నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా విదేశీ ప్రతినిధులు పర్యటించే ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. 46 కిలోమీటర్ల బిటి రోడ్డు పనులు, 24 కిలోమీటర్ల పెయింటింగ్ పనులు, పది కిలోమీటర్ల ఫుట్ పాత్ నిర్మాణం శాశ్వత ప్రాతిపదికన పూర్తి చేసినట్లు తెలిపారు. విశాఖ నగరం దేశంలోనే సుందర నగరంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ సదస్సుకు జి 20 దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ కి చెందిన దేశాలు కూడా పాల్గొంటున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 28వ తేదీన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారని, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమావేశాలను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఈ సదస్సుకు విచ్చేసే విదేశీ ప్రతినిధులకు రాష్ట్ర సమాచారాన్ని పూర్తిగా అందిస్తామని, పెట్టుబడులకు గల అవకాశాలు గూర్చి తెలియజేస్తామన్నారు.ఈ సమావేశంలో స్పెషల్ సి ఎస్ వై. శ్రీలక్ష్మి, ఎంఏడి డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లిఖార్జున, కమిషనర్ ఆఫ్ పోలీస్ సిహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజబాబు, పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ,మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి హాజరయ్యారు

# నేను దొంగ ఓట్లతో గెలిచా

కాకినాడ, మార్చి 27, (న్యూస్ పల్స్)సంచలన వ్యాఖ్యలు చేస్తూ రెండు రోజులుగా ప్రధానంగా వార్తల్లో నిలుస్తున్న జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కూడా ఓ బాంబు పేల్చారు. తాను గెలవడానికి కారణం దొంగ ఓట్లే అని ఒప్పుకున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో ఈ నెల 24న వైఎస్ఆర్ సీపీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజోలు ఎమ్మెల్యే అయిన రాపాక వరప్రసాదరావు ఆ సమ్మేళనంలో మాట్లాడుతూ.. పూర్వం నుంచి తమ గ్రామం చింతలమోరికి ఓ బ్యాచ్ దొంగ ఓట్లు వేయడానికి వచ్చేవారని చెప్పారు. ఆ ఓట్లతో తన విజయానికి వారు సహకరించేవారని బహిరంగంగా చెప్పారు. 15 నుంచి 20 మంది వచ్చి, ఒక్కొక్కరూ 5 నుంచి 10కి పైగా ఓట్లు వేసేవారని ఆయన చెప్పడం విస్మయం కలిగించింది. దీంతో తనకు 800 పైనే మెజారిటీ వచ్చిందని వివరించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్గా మారింది.2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపు నుంచి పోటీ చేసిన రాపాక వరప్రసాదరావుకు 50,053 ఓట్లు వచ్చాయి. వైఎస్ఆర్ సీపీ అభ్యర్థిగా ఉన్న బొంతు రాజేశ్వరరావుకు 49,239 ఓట్లు వచ్చాయి. టీడీపీ నుంచి పోటీ చేసిన గొల్లపల్లి సూర్యారావుకు 44,592 ఓట్లు వచ్చాయి. దీంతో రాపాక వరప్రసాదరావు 814 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఈ క్రమంలోనే తాజాగా ఆయన గెలుపునకు దొంగ ఓట్లే కారణం అని చెబుతుండడం ప్రాధాన్యం సంతరించుకుందిరాపాక వరప్రసాదరావు దొంగ ఓట్లతో గెలిచారని తాను అప్పుడే చెప్పానని ఆయన చేతిలో ఓడిపోయిన నేత బొంతు రాజేశ్వరరావు స్పందించారు. అదే విషయం కోర్టుకు కూడా చెప్పానని అన్నారు. కానీ, ఇప్పుడు తానే స్వయంగా దొంగ ఓట్ల వల్లే తాను గెలిచినట్లుగా రాపాక వరప్రసాదరావు గెలిచినట్లు ఒప్పుకున్నారని అన్నారు. ప్రజలు కూడా ఈ విషయాలను గ్రహించి సంఘానికి మంచి చేసిన వారికే ఓటు వేసి గెలిపించాలని కోరారు.రాజోలులో వైఎస్ఆర్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నేత బొంతు రాజేశ్వరరావు గతేడాది డిసెంబరులో జనసేన కండువా కప్పుకున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జనసేనలో చేరిన అనంతరం వైసీపీపై బొంతు రాజేశ్వరరావు విమర్శలు చేశారు. వైసీపీలో మొదటి నుంచి ఉన్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని, పార్టీ కోసం కష్టపడిన వారిని జైలుకు పంపుతున్నారని విమర్శించారు. దళిత యువకుడిని చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ వచ్చిందని, కానీ జగన్ అభిమాని కొడికత్తి శ్రీనుకు మాత్రం ఇప్పటివరకు బెయిల్ రాలేదని విమర్శించారు. కొడికత్తి శ్రీను ఇంకా జైల్లోనే మగ్గిపోతున్నాడని, అతడికి న్యాయం చేయడానికి కూడా వైసీపీ ముందుకు రావడం లేదని ఆరోపించారు.

### వరుసగా రెండు రో?జులుపాటు మూలవిరాట్ ను తాకిని సూర్యాకిరణాలు

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం జుత్తిగ గ్రామం లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి వారి ఆలయం లో వరసుగా 2 రోజులు నుంచి విగ్రహాలను ( మూల విరాట్ ని ) సూర్య కిరణాలు తాకుతున్నాయి. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మూల విరాట్ విగ్రహాన్ని సూర్య కిరణాలు తాకాయి. ఈరోజు షష్ఠి తిథి – స్వామి వారి ని సూర్య కిరణాలు తాకడం విశేషం ఈ దర్శనం తో కాల సర్ప, కుజ దోషాలు నివారణ అవుతాయని తి. తి.దే. పండితుడు ఫణీంద్ర శర్మ అంటున్నారు.

# స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలి

## సిఐటియు నాయకులు



నంద్యాల మా ప్రతినిధి :గ్రామాల్లో చెత్తాచెదారాన్ని సేకరించి ఊరి చివర వేసి గ్రామాల పరిశుభ్రతకు ప్రజలకు అంటురోగాలు రాకుండా చూస్తూ నిత్యం సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే పెండింగ్ వేతనాలు ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం సత్యాభారత్ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సుబ్బరాయుడు నారాయణ త్యాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం మీడియా తో మాట్లాడుతూ ఒకపక్క రోజురోజుకు ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ ఉంటే ఇచ్చే అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ స్వచ్ఛభారత్ కార్మికులు నిత్యం పనిచేస్తున్నారని, వారికి నెల నెల వేతనాలు ఇవ్వకుండా అధికారులు పనులు మాత్రం చేయించుకుంటూ ఉన్నారన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సర్పంచుల చుట్టూ జిల్లా అధికారుల చుట్టూ తిరిగిన ఏమాత్రం ఫలితం లేదన్నారు . వేతనాలు ఇవ్వమని అధికారులను అడుగుతే మీరు పనులు చాలించుకోండి వేరేవాళ్లను పెట్టుకుంటామని నేటికి బెదిరింపులు వస్తున్నాయన్నారు. కొన్నిచోట్ల గ్రామ సర్పంచులు మా గ్రాంటు నుండి మీకు వేతనాలు ఇవ్వము మీరు పనులు చాలించుకోండి అని చెబుతున్నారని అన్నారు . గత మూడు సంవత్సరాల క్రితం 10,000 జీతం ఇస్తామంటూ జీవో నెంబర్ 680 ఇచ్చినా నేటికీ అమలు కావడం లేదని రాష్ట్రంలో పెద్ద పండుగలైన శివరాత్రి ఉగాది పండుగలకు వేతనాలు వస్తాయని ఎదురుచూసిన స్వచ్ఛభారత్ కార్మికులకు నిరాశ మిగిలిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేతనాలు సక్రమంగా చెల్లిస్తామని ఒక ప్రక్క ప్రచారం చేసుకుంటూ వున్న వాస్తవానికి చిన్న ఉద్యోగస్తులకు నెలలు తరబడి వేతనాలు అందకపోవడంతో మానసికంగా కృంగిపోతున్నారన్నారు.

### నంద్యాల పురపాలక సంఘం లో మార్కెట్ వేలములు రద్దు

నంద్యాల మా ప్రతినిధి :- నంద్యాల పట్టణం పురపాలక సంఘము నందు 2023-24 సంవత్సరమునకు మార్కెట్ గేట్లు. పార్కింగ్. పశువుల సంత చేపలు మరియు మాంసం . మార్కెట్ నందు రుసుము వసూలు చేసుకొనుటకు సోమవారం నాడు నంద్యాల పురపాలక సంఘము నందు బహిరంగ వేలాలు నిర్వహించుటకు మున్సిపల్ కార్యాలయం లో ఎర్పాట్లు చేసారు. సదరు వేలములలో పాల్గొన్న కొందరికి సాల్వెన్సీ సర్టిఫికెట్లు లేక పోవడంతో వేలాలను రద్దు చేసినట్లు ఆర్ ఓ వర ప్రసాద్ తెలిపారు. మళ్లీ బుధవారం బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# స్పందన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడండి--- జిల్లా ఎస్పీ. శ్రీ కె.రఘువీర్ రెడ్డి



నంద్యాల మా ప్రతినిధి :-నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ( 27-03-2023 ) నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి గారు 120 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు .చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు ,అత్తరింటి వేదింపులు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి.ఫిర్యాదుల పై అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని మరియు ప్రతి సోమవారం ప్రతి పోలీసు స్టేషన్ ,సర్కిల్ ఆఫీసు,డిఎస్పి ఆఫీసులలో స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా పోలీసు కార్యాలయానికి సంబందిత సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ ,ఎస్సీ/ ఎస్టీ సెల్ డిఎస్పి రామంజి నాయక్ పాల్గొన్నారు.

# భీమవరం లో పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ



నంద్యాల మా ప్రతినిధి :- నంద్యాల జిల్లా భీమవరం గ్రామంలో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆర్థిక సాయంతో నూతనంగా ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ ను నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో , కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ, బ్యాంకు ఎండి లు, అధికారులు హాజరయ్యారు. సహకార బ్యాంకుల ద్వారా అందించే వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అభివృద్ధి పథంలో నడవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సహకార కేంద్ర బ్యాంకులు రైతులకే కాకుండా మహిళ పొదుపు సంఘాలకు, చిన్న వ్యాపారస్తులకు అలాగే పెట్రోల్ బంకుల ఏర్పాటు చేసుకోవడానికి తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నారని తెలిపారు. సహకార కేంద్ర బ్యాంకులు అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పోలూరు గ్రామంలో కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని, యాలూరు గ్రామంలో రైతులకు కమ్యూనిటీ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయ పాల డైరీ అలాగే సహకార బ్యాంకులు లాభాల బాటలో నడుస్తున్నాయని ఇది ఎంతో శుభ పరిణామం అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు సహకార బ్యాంకులు చేయూత అందించి అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లడానికి కృషి చేయాలని కోరారు. పోలూరు సహకార సంఘం పరిధిలో 21 గ్రామాలు వ్యాపారాలు సాగిస్తున్నాయని సహకార బ్యాంకు అధికారులు తెలిపారు. సహకార సంఘం నందు 3328 మంది సభ్యులతో వాటాదనం 170.50 లక్షలు కలిగి 1122 మందికి రుణాలను అందజేయడం జరిగిందన్నారు. 2005వ సంవత్సరం నుండి మిట్నాల, భీమవరం, చాపి రేవుల సంఘాలను పోలూరు సంఘములో విలీనం చేయడం జరిగిందని అన్నారు. పోలూరు గ్రామంలో కార్యాలయాన్ని మరియు గోదాము అలాగే పాండురంగాపురం గ్రామంలో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా సంఘ సభ్యులకు ఫర్టిలైజర్స్ అందిస్తున్నామని తెలిపారు. రైతులకు, ఇతర వ్యాపారం చేయు వారికి సహకార సంఘముల నుండి రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని వారు తెలిపారు.నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, భీమవరం గ్రామ వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# వైయస్సార్ విలేజ్ క్లీనిక్ 104 ద్వార వైద్య సేవలు..



నంద్యాల మా ప్రతినిధి :-ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ప్రభుత్వం,గ్రామాలలోకి 104 ద్వారా ఫ్యామిలీ డాక్టర్, పి జి సియన్ ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకె వైద్య సేవలు విస్తరించి అక్కడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ,జాయింట్ కలెక్టర్ నిశాంతి ,జిల్లా వైద్య అధికారి. ఆధ్వర్యంలో ఐదు 104 వాహనాలకు జెండా ఊపి 104 వైద్య సేవల ను ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఈషాక్ బాషా ప్రారంభించారు .

## పురపాలక స్పందనకు రెండు అర్జీలు

నంద్యాల మా ప్రతినిధి :- . సోమవారం రోజు జరిగిన స్పందనకు రెండు అర్జీలు వచ్చాయని ఎమ్ ఈఈ రమణ మూర్తి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఎమ్ ఈఈరమణ మూర్తి అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. వివిధ అంశాలపై రెండు అర్జీలు అందాయని చెప్పారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# గేమ్ చేంజర్.. మనోళ్ళు హర్ట్ అయ్యారు!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాకి గేమ్ చేంజర్ అనే టైటిల్ ని ఖరారు చేసిన సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో దిల్ రాజు ఈ సినిమాని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతుంది. రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ మూవీకి సంబందించిన టైటిల్ ప్రోమోని రిలీజ్ చేశారు.శంకర్ స్టైల్ లో చాలా క్రియేటివ్ గా ఈ టైటిల్ ప్రోమో ఉండటంతో సోషల్ మీడియాలో భాగానే వైరల్ అవుతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్ ని కూడా రిలీజ్ చేశారు. అయితే ఈ పోస్టర్ ని తమిళంలో అయితే ఒక్క టైటిల్ తప్ప మిగిలిన పేర్లు అన్ని కూడా తమిళ్ లోనే రాశారు.అయితే మిగిలిన భాషలకి వచ్చేసరికి టైటిల్ తో పాటు మిగిలిన క్రూ పేర్లు అన్ని కూడా ఇంగ్లీష్ లో రాసాను దీనిపై కొంతమంది సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు. అంటే తెలుగు వాళ్ళ కోసం పోస్టర్ లో పేర్లు తెలుగులో రాయకూడదా. తమిళ్ లో పోస్టర్ ని తమిళ్ భాషలో పేర్లు రాసినపుడు మరి తెలుగులో కూడా రాయాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. తెలుగు వాళ్ళు అంటే చిన్న చూపా లేకా తెలుగు భాష అంటే చిన్న చూప అని కొంతమంది కామెంట్స్ చేస్తూ ఉండటం విశేషం. నిజానికి తమిళ్ భాషలో తెరకెక్కే సినిమాలకి పోస్టర్ లో పేర్లు తమిళంలోనే వేస్తారు. దీనికి కారణం వారు తమిళ్ భాషకి అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఒక వేళ పేర్లు మాతృభాషలో లేకపోతే దానిని అసలు ఓన్ చేసుకోవడానికి కూడా ఇష్టపడరు.ఇది శంకర్ కి భాగా తెలిసే అలా ఒక పోస్టర్ ని తమిళ్ పేర్లతో రిలీజ్ చేసి మరో పోస్టర్ ని ఇంగ్లీష్ పేర్లతో రిలీజ్ చేశారు. పోస్టర్ లుక్ మెగా ఫ్యాన్స్ కి కనెక్ట్ కావడంతో అభిమానుల వరకు ఈ విషయాన్ని పట్టించుకోరు కాని తెలుగు భాష మీద అభిమానులు ఉన్నవారు మాత్రం వివాదం చేసే ప్రయత్నం చేస్తారు అని చెప్పాలి.




# విజయ్.. సమంత ప్రేమ కథలో ఆమె పాత్ర ఏంటో?

దర్శకుడు శివ నిర్వాణ రూపొందించే సినిమాలన్నీ కూడా చాలా విభిన్నంగా.. డీసెంట్ లవ్ స్టోరీతో ఉంటాయి. మజిలీ.. నిన్ను కోరి సినిమాలు ఎంతటి డీసెంట్ లవ్ స్టోరీస్ తో రూపొందాయో అందరికి తెల్సిందే. ఇలాంటి లవ్ స్టోరీస్ తో కూడా సినిమాలు చేయవచ్చా అని ఆశ్చర్యపోయే విధంగా శివ నిర్వాణ సినిమాలు ఉంటాయి.బ్యాక్ టు బ్యాక్ మంచి విజయాలను సొంతం చేసుకుంటున్న శివ నిర్వాణ ప్రస్తుతం ఖుషి సినిమాను రూపొందిస్తున్నాడు. విజయ్ దేవరకొండ హీరో గా సమంత హీరోయిన్ గా ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెల్సిందే. ఈ సినిమా ఇప్పటికే పూర్తి అయ్యి విడుదల కావాల్సి ఉండగా సమంత అనారోగ్య సమస్యల కారణంగా ఆలస్యం అయింది.ఇటీవలే మళ్లీ షూటింగ్ ప్రారంభం అయిన ఖుషి సినిమా గురించి ఆసక్తికర వార్త ఒకటి సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఈ సినిమాలో సమంత చెల్లి పాత్రలో దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలో కనిపించబోతుందట. గతంలో ఈమె మజిలీ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమాలో దివ్యాంశ పాత్ర పరిమితంగా ఉంటుంది. కానీ ఖుషి లో కాస్త ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది.ఆలుమగలు అయిన విజయ్ దేవరకొండ.. సమంత మధ్య దివ్యాంశ కౌశిక్ ఎంట్రీతో జరిగేది ఏంటి అనేది సినిమా కథ అన్నట్లు గా ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పెళ్లి తర్వాత ట్రైయాంగిల్ లవ్ స్టోరీ ఏమైనా ఈ సినిమాలో సాగుతుందా అనే అనుమానాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.విజయ్ దేవరకొండతో దివ్యాంశ కౌశిక్ యొక్క కాంబో సన్నివేశాలు ఎలా ఉంటాయా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మజిలీ సినిమాలో ఒక హీరోయిన్ అదనంగా ఉండగా.. నిన్ను కోరి సినిమాలో ఒక హీరో అదనంగా ఉన్నాడు. ఇప్పుడు ఖుషి సినిమాలో ఒక హీరోయిన్ ను అదనంగా శివ నిర్వాణ నటింపజేస్తున్నాడు. కనుక ఈ సినిమా కూడా సర్ ప్రైజ్ సూపర్ హిట్ అవ్వడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




# తస్కిన్ విజృంభణ.. పసికూనలపై బంగ్లాదేశ్ ప్రతాపం

స్వదేశంలో బంగ్లాదేశ్ విజయాల పరంపర కొనసాగుతుంది. ఇటీవలే జగజ్జేత ఇంగ్లండ్‌ను క్లీన్‌స్వీప్ (3-0 తేడాతో టీ20 సిరీస్) చేసి జోష్ మీదున్న బంగ్లాదేశ్..ఐర్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న హోం సిరీస్‌లోనూ అదే జోరును కంటిన్యూ చేస్తోంది.3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకున్న బంగ్లా పులులు.. ఇవాళ (మార్చి 27) మొదలైన టీ20 సిరీస్‌కు కూడా శుభారంభం చేశారు. చట్టోగ్రామ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం బంగ్లాదేశ్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిధ్య జట్టు.. 19.2 ఓవర్ల తర్వాత 207/5 స్కోర్ వద్ద ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుండగా, వర్షం మొదలైంది. చాలా సేపు కొనసాగిన వర్షం నిర్ణీత సమయానికి కాస్త ముందు ఎడతెరిపినివ్వడంతో రిఫరీ మ్యాచ్‌ను ప్రారంభించాడు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం బంగ్లా టార్గెట్‌ను 8 ఓవర్లలో 104 పరుగులుగా నిర్ధేశించారు.ధాటిగా ఛేదనను ప్రారంభించిన ఐర్లాండ్‌ను తస్కిన్ అహ్మద్ దారుణంగా దెబ్బకొట్టాడు. తొలి ఓవర్‌లో 18 పరుగులు, రెండో ఓవర్‌లో 14 పరుగులు రాబట్టి లక్ష్యం దిశగా పరుగులు తీస్తున్న ఐర్లాండ్‌ను తస్కిన్ అహ్మద్ ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తీసి దెబ్బకొట్టాడు. 2 ఓవర్ల తర్వాత 32/0గా ఉన్న స్కోర్ 4 ఓవర్ల తర్వాత 44/4గా మారింది. ఈ పరిస్థితి తర్వాత కూడా ఏమాత్రం తగ్గని ఐర్లాండ్ తమవంతు ప్రయత్నం చేసి చివరికి ఓటమిపాలైంది. 2 ఓవర్లు వేసిన తస్కిన్ 16 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.అంతకుముందు.. లిట్టన్ దాస్ (23 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), రోని తలుక్దార్ (38 బంతుల్లో 67; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), షమీమ్ హ్పస్సేన్ (20 బంతుల్లో 30; 2 ఫోర్లు, సిక్స్), షకీబ్ (13 బంతుల్లో 20 నాటౌట్; 3 ఫోర్లు) రాణించడంతో బంగ్లాదేశ్ 19.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. మరో 4 బంతులు మిగిలుండగానే వర్షం ప్రారంభంకావడంతో బంగ్లా ఇన్నింగ్స్ అక్కడే ముగిసింది. బంగ్లా-ఐర్లాండ్ మధ్య రెండో టీ20 మార్చి 29న జరుగుతుంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190